క్లుప్తంగా

గల్ఫ్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న గల్ఫ్ సంఘాల ప్రతినిధులు

వేములవాడ: గల్ఫ్ కార్మికుల సమస్యలను కాంగ్రెస్ ప్రభుత్వం పరిష్కరించాలని దుబాయ్ పర్యటనలో ఉన్న ప్రభుత్వవిప్ ఆది శ్రీనివాస్‌కు గురువారం అక్కడి సంఘాల ప్రతినిధులు వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

యోగా శిక్షణ ప్రారంభం



సిరిసిల్లటౌన్: సిరిసిల్లలోని ఇందిరాపార్కులో పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో నిత్య యోగా శిక్షణ తరగతులను గురువారం ప్రారంభించారు. యోగా శిక్షకుడు ఎలిగేటి కృష్ణ ఆధ్వర్యంలో వేసవి క్యాంపు నిర్వహించారు. బీఎస్సీ జిల్లా ఉపాధ్యక్షుడు ఆంకాలపు రవి, పతంజలి యోగా సమితి జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్ల శ్రీకాంత్, మహేశ్, ఎల్దండి శంకర్, దుబాల మొండయ్య, వెంకట్రావు, బ్రహ్మచారి, దామోదర్, రమేశ్, వేణు తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌జీరావు ట్రస్ట్ ఉచిత విద్యకు విద్యార్థుల ఎంపిక



సిరిసిల్లకల్చరల్: ఆర్‌జీరావు ఎడ్యుకేషనల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రతిభా పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థుల జాబితాను ప్రకటించారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 46 మందిని ఎంపికచేయగా జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి 17 మంది విద్యార్థులు ఉండడం విశేషం. జిల్లా నుంచి ఎంపికైన 17 మందిలో 8 మంది విద్యార్థులు స్థానిక యోగీశ్వర ఇనిస్టిట్యూట్‌లో ప్రత్యేక శిక్షణ పొందారు. ఇంటర్వ్యూలకు ఎంపికైన విద్యార్థులను ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు గూడూరి నిశాంత్ గురువారం సాయంత్రం అభినందించారు. ఈనెల 30న హైదరాబాద్ బాచుపల్లిలోని సూర్య ది గ్లోబల్ స్కూల్‌లో వీరికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. రేషన్, ఆధార్‌కార్డు, పదో తరగతి మెమో, స్టడీ, కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో పాటు 5 పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలతో ఇంటర్వ్యూకు హాజరుకావాలని సూచించారు.

26 నుంచి ఎల్లమ్మ సిద్ధోగం

గంభీరావుపేట: మండలకేంద్రంలోని గౌడసంఘం ఆధ్వర్యంలో ఎల్లమ్మ సిద్ధోగం వేడుకలు ఈనెల 26నుంచి జరగనున్నాయి. అందులో భాగంగా గురువారం ఎల్లమ్మ గడ పావన సేవ ఉత్సవం ఘనంగా నిర్వహించారు. దీనిలో గౌడ సంఘం నాయకులు పాల్గొన్నారు. 26న రేణుకా–జమదగ్నిల కల్యాణోత్సవం, 27న ఎల్లమ్మ బోనాల ఊరేగింపు నిర్వహించనున్నారు. ఇందుకు ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

ఘనంగా రథోత్సవం


కనగర్తిలో రథాన్ని లాగుతున్న భక్తులు

కోనరావుపేట: మండలంలోని కనగర్తిలో శ్రీ వేణుగోపాలస్వామి రథోత్సవాన్ని గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఏటా వైశాఖ పూర్ణిమ రోజు రథోత్సవం నిర్వహిస్తారు. మహిళలు మంగళహారతులతో స్వాగతం పలికి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తమండలి సభ్యులు నగరసంకీర్తనలతో ముందుకుసాగగా, యువకులు రథాన్ని లాగారు.

అక్రమంగా మట్టి తవ్వకం ?



తంగళ్లపల్లి: మండలంలోని అంకుషాపూర్ గ్రామ శివారు గోపాల్ చెరువులో అక్రమంగా మట్టిని తవ్వి టిప్పర్లతో తరలిస్తున్నారని గురువారం గ్రామస్తులు ఆరోపించారు. రైతులు, గ్రామస్తులు చేరుకుని మట్టి తవ్వకాన్ని అడ్డుకుని 'సాక్షి'కి సమాచారం అందించారు. గోపాల్ చెరువులో మట్టి తవ్వకం గురించి తంగళ్లపల్లి రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మధును వివరణ కోరగా చెరువులో మట్టి తవ్వకం నిజమేనని రైల్వేలైన్ కోసం జిల్లా అధికారులు, మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని చెరువు నుంచి మట్టి తరలిస్తున్నారని తెలిపారు.

ప్రారంభించారు.. వదిలేశారు

- అందుబాటులోకి రాని ఆరోగ్య ఉపకేంద్ర భవనాలు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- అద్దె భవనాల్లోనే సిబ్బంది వైద్య సేవలు


ఈ చిత్రంలో కనిపిస్తున్న ఆరోగ్య ఉపకేంద్రం కోనరావుపేట మండలకేంద్రంలోనిది. ఈ భవనాన్ని గతేడాది జూన్ 19న అప్పటి ఎమ్మెల్యే రమేశ్‌బాబు ఆర్భాటంగా ప్రారంభించారు. ఏడాది అవుతున్నా ఇప్పటివరకు ఈ భవనం వినియోగంలోకి రాలేదు. ఆరోగ్యకేంద్ర భవన ప్రారంభంతో తమ దూరభారం తగ్గిందని భావించిన వృద్ధులు, వికలాంగులకు నిరాశే మిగిలింది. 'ఇదొక్కటే కాదు మండలంలో నిర్మించిన నాలుగు ఆరోగ్య ఉపకేంద్రాలదీ ఇదే పరిస్థితి.


సుద్దాల ఆరోగ్య ఉపకేంద్రంలో పూర్తికాని పనులు

కోనరావుపేట: గ్రామీణ ప్రాంతాల ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాలను ప్రారంభించినా నేటికీ వినియోగంలోకి రాలేదు. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఫలితంగా నాలుగు ఉపకేంద్రాలు నిర్మించి ప్రారంభించినా ఫలితం లేకుండా పోయింది.

5 ఉపకేంద్రాలు మంజూరు

మండలప్రాథమిక ఆరోగ్యకేంద్ర పరిధిలో 28 గ్రామాలున్నాయి. ఆరోగ్యకేంద్రంతో పాటు ఎనిమిది ఉపకేంద్రాలు కొనసాగుతున్నాయి. నిమ్మపల్లి, ధర్మారం, నిజామాబాద్ గ్రామాల్లో ఉపకేంద్రాలకు సొంత భవనాలుండగా మిగతా 5 ఉపకేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. మండలంలో ఐదు ఉపకేంద్రాలకు కలిపి ఒక్కో కేంద్రానికి రూ.20 లక్షలు మంజూరు కాగా మామిడిపల్లి, వట్టిమల్ల, కోనరావుపేట, సుద్దాలలో పనులు పూర్తిచేసి నాలుగు గ్రామాల్లో ప్రారంభించారు. ఒక్క కొలనూర్‌లో పనులు చివరిదశకు చేరుకున్నాయి.

పనుల్లో నాణ్యతా లోపం

మండలంలోని గ్రామాల్లో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాల్లో నాణ్యతాలోపం కనిపిస్తోంది. వట్టిమలలో నిర్మించిన ఉపకేంద్రం పనుల్లో నాణ్యత లోపించింది. దీంతో ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మామిడిపల్లిలో భవనం నిర్మించినా ముగింపు పనుల కోసం మరో రూ.4 లక్షలు మంజూరు చేశారు. సుద్దాల, కోనరావుపేట గ్రామాల్లో పనులు పూర్తయ్యాయి. కొలనూర్‌లో పనులు చివరి దశకు చేరాయి. అయితే అన్నిగ్రామాల్లో నిర్మించిన ఉపకేంద్ర భవనాల్లో నాణ్యతా లోపించిందని ఆయాగ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

వినియోగంలోకి తేవాలి



మండలకేంద్రంలోని గాంధీ నగర్ ప్రాంతంలో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రం భవనాన్ని గతేడాది జూన్‌లో ప్రారంభించారు. ఈ ప్రాంతం నుంచి ఆరోగ్య కేంద్రానికి వెళ్లాలంటే సుమారు కిలోమీటరు వరకు వెళ్లాలి. వృద్ధులు, వికలాంగులు వెళ్లలేని పరిస్థితి ఉంది. ఇక్కడ నిర్మించిన కేంద్రాన్ని త్వరగా వినియోగంలోకి తేస్తే ఈ ప్రాంత ప్రజలందరికీ ఉపయోగకరంగా ఉంటుంది.

– చీకోటి తిరుపతి, కోనరావుపేట

పనులు చేసి అప్పగించాలి



మండలంలో మొత్తం ఎనిమిది ఆరోగ్య ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటిలో ధర్మారం, నిమ్మపల్లి, నిజామాబాద్ గ్రామాల్లో సొంత భవనాలుండగా మిగిలిన గ్రామాల్లో భవనాలు నిర్మించి ప్రారంభించారు. కానీ వాటిలోపూర్తిస్థాయిలో పనులు కాలేదని పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటివరకు మాకు అప్పగించలేదు. పనులు పూర్తిచేసి త్వరగా అప్పగించాలి.

– వేణుమాధవ్, కోనరావుపేట వైద్యాధికారి

మిగిలిన పనులకు ప్రతిపాదనలు పంపాం

కోనరావుపేట, సుద్దాల, వట్టిమల్ల, మామిడిపల్లి గ్రామాల్లో నిర్మించిన ఆరోగ్య ఉపకేంద్రాల్లో నల్లాలు, టాయిలెట్లు, డోర్లు తదితర పనులు పూర్తిస్థాయిలో కాలేదు. మిగిలిన పనులకోసం ఒక్కో కేంద్రానికి రూ.2లక్షల చొప్పున ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు అయితే పనులు పూర్తిచేసి వైద్యాధికారులకు అప్పగిస్తాం.

– అంజయ్య, ఏఈ, పంచాయతీరాజ్

క్రీడలతో మానసికోల్లాసం


రుద్రంగి: క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న అడిషనల్ ఎస్పీ చంద్రయ్య


బోయినపల్లి: యువకులతో కబడ్డీ ఆడుతున్న సీఐ శ్రీనివాస్, ఎస్సై పృథ్వీధర్

- అడిషనల్ ఎస్పీ చంద్రయ్య

రుద్రంగి: క్రీడలతో మానసికోల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం కలుగుతుందని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పేర్కొన్నారు. రుద్రంగి పోలీస్ ఆధ్వర్యంలో మండలకేంద్రంలో నిర్వహిస్తున్న కబడ్డీ, వాలీబాల్ క్రీడా పోటీలను గురువారం చందుర్తి సీఐ వేంకటేశ్వర్లు, ఎస్సై అశోక్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు బానిసలు కావద్దన్నారు. చదువుతోపాటు క్రీడలపై దృష్టిసారించాలన్నారు. నాయకులు తర్రె మనోహర్, గంగం మహేశ్, పీఈటీలు గాజుల వేణు, సుంచు అనిల్, లింగంపెల్లి రవి, రుద్రంగి పోలీస్ సిబ్బంది, మండలంలోని గ్రామాల క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

చందుర్తి : యువత చదువుతో పాటు క్రీడల పట్ల ఆసక్తి పెంచుకోవాలని అడిషనల్ ఎస్పీ చంద్రయ్య పిలుపునిచ్చారు. మండలంలోని మల్యాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడా పోటీలు ప్రారంభించారు. కార్యక్రమంలో చందుర్తి సీఐ గాండ్ల వెంకటేశర్లు, ఎస్సై శ్రీకాంత్, పోలీసు సిబ్బందితో పాటు క్రీడాకారులు పాల్గొన్నారు.

ముస్తాబాద్: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ అన్నారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దోస్త్ పోలీస్ క్రీడాపోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గ్రామీణ క్రీడాకారుల్లో ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు వాలీబాల్, కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. పీడీ దూలం లక్ష్మీ నారాయణ, పీఈటీలు సురేశ్, రాజశేఖర్, ఎస్‌కే గౌస్, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బోయినపల్లి: క్రీడలతో యువకుల్లో చురుకుదనం పెరుగుతుందని వేములవాడ రూరల్ సీఐ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఎస్సై పృథ్వీధర్‌గౌడ్ ఆధ్వర్యంలో దోస్తీ వాలీబాల్, కబడ్డీ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఎస్సై పృథ్వీధర్ తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: యువత క్రీడలపై దృష్టి సారించాలని, ఎస్సై ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రంలోని ఆశ్రమ పాఠశాల ఆవరణలో మండలస్థాయి కబడ్డీ, వాలీబాల్ పోటీలను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల నాయకులు గొట్టె రామచంద్రం, శివతేజరావు, రాస రవీందర్ రెడ్డి, ప్రశాంత్, ఎల్లయ్య పోలీస్ సిబ్బంది జగన్, విశాల్, నాయకులు, క్రీడాకారులు పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలకేంద్రంలోని కేజీ టు పీజీ క్రీడా ప్రాంగణంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. కార్యక్రమంలో ఎల్లారెడ్డిపేట సీఐ శ్రీనివాస్‌గౌడ్ పోటీలు ప్రారంభించారు. ఎస్సై రామ్మోహన్, తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో ఎస్సై రమేశ్ దోస్త్ మీట్ మండలస్థాయి క్రీడాపోటీలు ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కబడ్డీ 8 జట్లు, వాలీబాల్ 16 జట్లు పాల్గొనట్లు ఎస్సై తెలిపారు.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు

- ఎస్సై రమాకాంత్

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఎవరైనా రైతులకు నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై రమాకాంత్ అన్నారు. పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండలకేంద్రంతో పాటు చుట్టుపక్కల గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపుల యజమానులు రైతులకు నకిలీ విత్తనాలు అమ్మవద్దన్నారు. ఎలాంటి లైసెన్స్‌లు లేకుండా గ్రామాల్లో తిరుగుతూ నకిలీ విత్తనాలు రైతులకు అంటగడితే వారిపై పీడీయాక్ట్ నమోదు చేస్తామన్నారు. నకిలీ విత్తనాలు అమ్మితే రైతులు ఫిర్యాదు చేయాలని కోరారు

ఎంపీడీవోకు ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని గిద్ద చెరువు కట్ట మైసమ్మ పండుగ పేరుతో ఒక్కో ఉపాధి కూలీ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ రూ.200 చొప్పున వసూలు చేస్తున్నాడని, సదరు వ్యక్తిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు గురువారం డిమాండ్‌చేశారు. ఈ మేరకు ఎంపీడీవో సత్తయ్యకు కాంగ్రెస్ నాయకుడు గుర్రపు రాములు ఫిర్యాదు చేశారు. గిద్ద చెరువులో మట్టి పనులు చేస్తున్న ఉపాధి కూలీలందరి వద్ద ఫీల్డ్ అసిస్టెంట్ కోనేటి నరేశ్ రూ.200 చొప్పున వసూలు చేశాడని రాములు తెలిపారు. గిద్ద చెరువు శిఖం భూమిలో ఉపాధి కూలీలతో తీస్తున్న మట్టిని రైతుల పొలాలకు అందించాల్సింది పోయి బయటి వ్యక్తులకు అమ్ముకుంటున్నట్లు తెలిపారు. గిద్ద చెరువులో పండుగ కోసం ఏటా ఖర్చుల కోసం కూలీలు డబ్బులు జమ చేసుకుంటారని, ఇందులో ఎవరి బలవంతం లేదని ఫీల్డ్ అసిస్టెంట్ నరేశ్ అన్నారు. ఈ విషయంపై ఎంపీడీవో సత్తయ్యను వివరణ కోరగా విచారణ జరిపి చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

సన్మానం

తంగళ్లపల్లి: మున్నూరుకాపు సంఘం జిల్లా అధ్యక్షుడిగా నూతనంగా ఎన్నికైన బొప్ప దేవన్నను గురువారం తంగళ్లపల్లి మండలం పద్మశాలీ సంఘం అధ్యక్షుడు, కాంగ్రెస్ నాయకుడు బైరి రమేశ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా దేవన్నను శాలువాతో సన్మానించి శుభకాంక్షలు తెలిపారు. బైరి రమేశ్‌తోపాటు కాంగ్రెస్ నాయకుడు, న్యాయవాది బొద్దుల రాజేశ్ తదితరులున్నారు.

జనగామలో బీఆర్‌ఎస్ నాయకుల ప్రచారం

ముస్తాబాద్: వరంగల్‌లో బీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ అభ్యర్థి రాకేశ్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ముస్తాబాద్ మండల బీఆర్‌ఎస్ నాయకులు వారం రోజులుగా విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నారు. మాజీ ఎంపీపీ అక్కరాజు శ్రీనివాస్ నేతృత్వంలో జనగామలో వారం రోజులుగా గ్రాడ్యుయేట్లను కలుస్తూ ప్రచారం చేపట్టారు. ఏఎంసీ మాజీ డైరెక్టర్ చిగురు నరేశ్, నాయకులు బద్దిపడిగె నందు, నరేశ్, ఎనగందుల నర్సింలు, నాగరాజు తదితరులున్నారు.


ముస్తాబాద్ : ప్రచారం చేస్తున్న నాయకులు

కోనరావుపేట: వరంగల్, ఖమ్మం, నల్లగొండ పట్టభద్రుల ఎన్నికల్లో వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీ నర్సింహారావు ప్రచారం నిర్వహించారు. ఇందులో పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణంలో బీఆర్‌ఎస్ అభ్యర్థి ఏనుగుల రాకేశ్‌రెడ్డికి మద్దతుగా ప్రచారం చేశారు.

మజ్జిగ పంపిణీ

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలకేంద్రంలో బీటీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రంలో గురువారం ఫౌండేషన్ అధ్యక్షుడు బెంద్రం తిరుపతి రెడ్డి మజ్జిగ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బండారి రాజు, బొల్లారం ప్రసన్న, దండవేణి రజినీకాంత్, గజ్జెట శ్రీనివాస్, గుగ్గిళ్ల ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

కోనరావుపేట: మండలంలోని వెంకట్రావుపేటలోమంగళవారం మట్టిపెళ్లలు కూలి ఉపాధి హామీ కూలీ మారుపాక రాజవ్వ మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రముఖ న్యాయవాది, కాంగ్రెస్ నాయకుడు పిట్టల భూమేశ్ ముదిరాజ్, కోనరావుపేట మాజీ సర్పంచ్ చందనగిరి గోపాల్, మాజీ సర్పంచుల సంఘం వ్యవస్థాపకుడు బొద్దు దేవయ్య బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా పిట్టల భూమేశ్, చందనగి గోపాల్ మాట్లాడుతూ.. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. ఈ విషయం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సీఎం దృష్టికి తీసుకెళ్లారన్నారు. వలస కార్మికుల కష్టాల గురించి తెలుసుకునేందుకు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దుబాయ్ పర్యటనలో ఉంటే బీఆర్‌ఎస్ నాయకుడు చల్మెడ లక్ష్మీనర్సింహారావు ఆరోపణలు చేయడం సరికాదన్నారు. మాజీ సర్పంచ్ నర్సయ్య, ఎంపీటీసీ మంజుల రవీందర్ రెడ్డి, నాయకులు వెంకన్న, లింగంపల్లి మధూకర్, కాంగ్రెస్ అధ్యక్షులు వెంకటేశ్, పెద్దమల్లేశం, శంకర్, మల్లేశం, యూత్ అధ్యక్షుడు వేణు, లక్ష్మణ్, శ్రీకాంత్, తదితరులున్నారు

అధికారుల నిర్లక్ష్యంతోనే ఉపాధి కూలీ మృతి

- సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు


క్షతగాత్రులను పరామర్శిస్తున్న గుంటి వేణు

సిరిసిల్లటౌన్: ఉపాధి కూలీ మరణం..అధికారులు నిర్లక్ష్యంతోనేనని సీపీఐ జిల్లా కార్యదర్శి గుంటి వేణు ఆరోపించారు. ఇటీవల జిల్లాలోని వెంకట్రావుపేట చెరువు పనుల్లో మట్టిపెళ్లలు పడి ఉపాధి కూలీ మృతిచెందగా ఆరుగురు జిల్లాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిని గురువారం పరామర్శించి మాట్లాడారు. ఉపాధి పనుల స్థలాల్లో మౌలిక వసతులు కల్పించకపోవడంతోనే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయన్నారు. కూలీలకు వెంటవెంటనే కూలీడబ్బులు అందించేలా చూడాలని జిల్లా అధికారులకు సూచించారు. సంఘటనలో మృతురాలి కుటుంబానికి రూ. 10లక్షలు, గాయాలపాలైన వారికి రూ. లక్ష చొప్పున పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సోమ నాగరాజు, సీపీఐ నాయకుడు అంగూరి రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

'గల్ఫ్ కార్మికులపై కాంగ్రెస్ కపట ప్రేమ'


మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

వేములవాడ : అరవై ఏళ్ల కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో సాగు తాగునీరు లేక ఈ ప్రాంత ప్రజలు ఉపాధి కోసం గల్ఫ్ బాట పట్టిన మాట వాస్తవం కాదా, నేడు గల్ఫ్ కార్మికుల మీద కపట ప్రేమ చూపిస్తూ కాలయాపన చేస్తుంది కాంగ్రెస్ ప్రభుత్వమేనని బీఆర్‌ఎస్ నాయకులు తీగల రవీందర్‌గౌడ్, పొలాస నరేందర్, కట్కం మల్లేశంలు గురువారం తెలిపారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ సకాలంలో కొనుగోలు చేయడం లేదన్నారు. వాహనాలు సమకూర్చాల్సిన మంత్రి అమెరికాకు, క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలను పరిష్కరించాల్సిన ఎమ్మెల్యే దుబాయ్‌కి వెళ్లడంపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు కౌన్సిలర్ జోగిని శంకర్, నాయకులు వాసాల శ్రీనివాస్, చీటి సంధ్యారాణి, సయ్యద్ బాబా, అంజద్‌పాషా, రాకేశ్, మైలారం రాము, హరీశ్‌గౌడ్, ఫర్వీజ్, అసద్ తదితరులు పాల్గొన్నారు.

విలేకరులమంటూ బెదిరింపులు

- భూమి చదును చేసుకుంటున్న రైతుల వద్ద డబ్బులు డిమాండ్
- విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని బాధితుల డిమాండ్


రైతులు సాగు చేసుకుంటున్న భూమి

చందుర్తి: వ్యవసాయం భూమి చదును చేసుకుంటున్న రైతులను తాము విలేకరులమని, పనులు నిలిపివేయాలని బెదిరించిన ఘటన మండలంలోని లింగంపేటలో గురువారం వెలుగులోకి వచ్చింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన కమటం లక్ష్మీరాజం, కమటం తిరుపతితో పాటు మరో ఇద్దరు అన్నదమ్ములకు గ్రామ శివారులోని 216 సర్వే నెంబర్‌లో ప్రభుత్వం లావణి పట్టాలను 1989లో అందించింది. ఆర్థికపరిస్థితి అంతంత మాత్రమే ఉండడంతో భూమి చదును చేసుకోలేక పత్తి సాగుచేశారు. ఆశించిన దిగుబడి రాకపోవడంతో బుధవారం రాత్రి జేసీబీ, మూడు ట్రాక్టర్లతో భూమిని చదును చేయిస్తున్నారు. విషయం తెలుసుకున్న గ్రామానికి చెందిన ఇద్దరితో పాటు మరో ఇద్దరు సిరిసిల్ల పట్టణానికి చెందిన విలేకరులమంటూ అర్ధరాత్రి పనులు నిలిపివేయాలని, మైనింగ్ అధికారులు, పోలీసులు వస్తున్నారంటూ బెదిరింపులకు పాల్పడ్డారు. అడిగినన్ని డబ్బులిస్తే వార్త రాయమంటూ డబ్బులు డిమాండ్ చేశారని తెలిసింది. దీంతో వారికి ప్రభుత్వం అందించిన పట్టా కాగితాలను చూపించేవరకు ఇబ్బందిపెట్టారని బాధిత రైతులు తెలిపారు. వెంటనే వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు బాధిత రైతులు డిమాండ్ చేస్తున్నారు.

'పదేళ్లలో బీఆర్‌ఎస్ చేసింది శూన్యం'


సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎల్లారెడ్డిపేట: బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాటు అధికారంలో ఉండి రైతులకు చేసింది శూన్యమని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య, మండల అధ్యక్షుడు సద్ది లక్ష్మారెడ్డి అన్నారు. మండలకేంద్రంలో గురువారం సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్‌ఎస్ నాయకులు అధికారం కోల్పోయి మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రభుత్వం రైతులకు విడుతల వారీగా రూ.500 బోనస్ ఇవ్వడం ఖాయమన్నారు. నాయకులు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, గౌస్, వంగ గిరిధర్‌రెడ్డి, దేవయ్య, బాబు, రాజేందర్, రవి, బాలకిషన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వారం రోజులుగా నిలిచాయి..



తంగళ్లపల్లి: ధాన్యం కొనుగోళ్లు వేగంగా పూర్తికావడంతో రైస్ మిల్లుల వద్ద లారీలు ధాన్యం లోడుతో అన్‌లోడింగ్ కోసం క్యూ కడుతున్నాయి. మండల కేంద్రంలోని ఓ రైస్ మిల్లులో అన్‌లోడింగ్ కోసం ప్రధాన రహదారి పక్కన లారీలు వారం రోజులుగా నిలిచి ఉన్నాయి. త్వరగా ధాన్యాన్ని రైస్ మిల్లులో అన్‌లోడ్ చేసుకుంటే కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం తరలించే అవకాశం ఉంది.

ఆలయాల్లో పూజలు

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలోని శ్రీ హనుమాన్ ఆలయంలో వైశాఖ పౌర్ణమి వేడుకల సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ పురోహితులు రాచర్ల దయానంద్ శర్మ ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి అభిషేకం, అర్చన, మంగళహారతి, చందనం పూసి పూజలు చేశారు. భక్తులకు తీర్థప్రసాదాలు అంఇంచారు. కార్యక్రమంలో బొందుగుల మార్కండేయాగుప్త, బండారి బాల్‌రెడ్డి, లింగపురం సత్యం, మహిళలు పాల్గొన్నారు.

బోయినపల్లి: మండలంలోని వరదవెల్లి గుట్టపై ఉన్న దత్తాత్రేయస్వామి ఆలయంలో గురువారం పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. మిడ్ మానేరు ప్రాజెక్టులో నీటిమట్టం తగ్గడంతో భక్తులు ఆలయానికి భారీగా తరలివచ్చారు. దర్శనం కోసం ఆలయంలో భక్తులు బారులుతీరారు. చాలా రోజుల తర్వాత ఆలయంలో భక్తుల సందడి నెలకొంది.